

# పసిడిమనసులు - షర్మిల



*నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!*

## నీ కోసమే కన్నీరు నించుటకు...

“అదిగో కాకి అరుస్తాంది మా చంటి వస్తాడేమో “నాయనమ్మ అని వీధి వైపు చూస్తూ అంది.

“ ఇంకే కోడిని కొయ్యి మీ తమ్ముడొస్తే గానీ ఆటికి మోక్షం రాదుగా “ తాత నవ్వుతూ అనడం విన్నా.

చంటి మావయ్య వస్తే నాకు పండగే. నాకేంటి పిల్లలందరికీ సంబరమే. మా చంటి మావయ్య నాకేకాదు మా నాన్నకీ మావయ్యే. మా అత్తయ్యని చేసుకోవడం వల్ల నాకు మావయ్య అయితే మా నాన్నకి మేనమామ. ఇంకా చెప్పాలంటే చందమావయ్య లాగా అందరికీ చంటిమావయ్య సుపరిచితం . ఏ పని కావాలన్నా మా చంటి మావయ్య చెబితే అయిపోతుందని అంతా అనుకునేవారు. మావయ్యకి బెజవాడలో కార్ల గ్యారేజీ వుండడంతో వచ్చినప్పుడల్లా ఒక్కో కార్ వేసుకుని వస్తాడు.

మా నాయనమ్మ రోజూ కాకిని అడగగా అడగగా ఒక రోజు చంటిమావయ్య దిగాడు, “ అదిగో అన్నానా ...చంటి వస్తాడని “ నాయనమ్మ చాటంత మొహంతో అంది.

“ నీ బొంద అది రోజూ అరుస్తానే వుంది , ఆడు ఇవ్వాళ వచ్చాడు “ అని తాత “ఏమే బేబీ ! అంటా మా అత్తయ్యని పలకరించారు.

“చూశారా నా తమ్ముడు, మరో పక్క అల్లుడు ...ఆడ్ని వదిలేసి కూతుర్ని పలకరిస్తన్నారు” అని నిష్టూరమాడింది

“ పోన్లేవే ! ఆడికి కొండంత అక్కవి నువ్వుండావుగా “ అని నన్ను చూసి “వూ ...ఎల్లు ! నీకెయ్యో ఒకటి ఏసుకొస్తాడుగా “ అనగానే పరిగెత్తుకుని చంటి మావయ్యని వాటేసుకున్నాను.

“అమ్మడూ! ఈ ఏడు సంక్రాంతికి బొమ్మల కొలువుకి కొత్త బొమ్మలు తెచ్చా... జాగ్రత్త గా దాచుకో , పగిలిపోకుండా వాటి చుట్టూ గడ్డి పెట్టి బుట్టలో పెట్టించా” అన్నాడు. మావయ్య వచ్చినప్పుడల్లా మావిడి కాయలో,సీతాఫలాలో,ద్రాక్ష కాయలో బుట్టలతో తెస్తాడు.

నా సంబరానికి నాయనమ్మ సందడికి అంతే లేదు.

“ ఒరే కొటేసూ ! కోడిని పట్టుకోరా “ అని చెప్పి మళ్లీ పొయ్యి ముట్టించింది. సాయంత్రానికి తిరిగి ఎళ్లేప్పుడు చూడాలి మా చంటి మావయ్య కళ్లనుంచి జలజలా నీళ్లు రాలుతున్నాయి. మా నాయనమ్మ పైట చెంగుతో, మావయ్య జేబు రుమాలతో కళ్లు తుడుచుకుంటా వుండారు. ఇదంతా మాకు అలవాటే మా మావయ్య మేము వచ్చేటప్పుడూ, ఎళ్లేటప్పుడు కళ్లమ్మట నీళ్లు పెట్టుకుంటానే వుంటాడు.

మేము బెజవాడ ఎప్పుడెళ్లినా మావయ్య పిల్లలందర్నీ హోటల్ కి తీసుకెళ్లి ఐస్ క్రీం పెట్టించేవాడు, నేను మావయ్యతో పాటే కార్ల షెడ్లో కూర్చునేదాన్ని. కాలేజీలో సీట్లు కావాలనో, ఏదో కంపెనీలో వుద్యోగం కోసం ఒక మాట చెప్పమనో రకరకాల పనుల కోసం ఎవరు వచ్చినా వాళ్ల పని పూర్తయ్యేవరకూ నిద్రపోయేవాడు కాదు.

మళ్లీ మా నాయనమ్మ కి ఏదో పెళ్లి పిలుపు రావడంతో నన్ను తీసుకుని బెజవాడ బయెల్దేరింది. బస్ దిగి రిక్షాలో మావయ్య ఇంటికి

చేరాం , మా అత్తయ్య నేను వచ్చానని మా చిన్న అత్తయ్య పిల్లల్ని కూడా రమ్మంది. పిల్లలందరినీ సినిమాకు తీసుకెళ్లాడు మావయ్య. తీరా అంతా ఇంటికి వచ్చేసరికి అత్తయ్య, నాయనమ్మ ఎవరింటికో ఎళ్లారు. అప్పుడు మా మావయ్య అక్కడ వున్న పెద్ద బేసిన్ తీసి అన్నమంతా అందులో వేసి పండుమిరపకాయ పచ్చడి ,ఇంత నెయ్యి పోసి కలిపాడు. మమ్మల్ని అందరినీ చుట్టూ కూర్చోబెట్టుకుని ఒక్కో ముద్ద చేతిలో పెడుతుంటే మొత్తం అన్నమంతా తినేశాం. మావయ్యకి కూడా మిగల్లేదు . అత్తయ్య తిరిగి వచ్చేసరికి మళ్లీ అన్నం వండాలని పొయ్యి మీద పెట్టాంగానీ అది మెత్తగా ముద్దలాగా అయిపోయింది. అత్తయ్య మమ్మల్ని ఏమంటుందోనని ... "అసలు నాకు అన్నం మెత్తగా వుంటేనే ఇష్టమని " అంటా తినేశాడు.

మేం తిరిగి బయెల్దేరే రోజు రానేవచ్చింది. మావయ్య మమ్మల్ని బస్టాండ్లో బస్ ఎక్కించాడు. నాకు కిటికీ దగ్గరే సీటు కావాలని ఎప్పుడూ గోల చేస్తానని వాళ్లనీ వీళ్లనీ బతిమాలి కిటికీ దగ్గర కూర్చోబెట్టాడు. బస్ కదులుతుండగా మావయ్య కళ్లల్లో నీళ్లు రాలిపడ్డాయి .

ఆ తర్వాత నేను వైజాగ్ వెళ్లిపోయాను. అప్పుడు సెలవలకి వచ్చినా ప్రతిసారీ తిరిగి వెళ్లేటప్పుడు రైలు ఎక్కించడానికి మావయ్యే వచ్చేవాడు. టీటీ ని బతిమాలి నన్ను కిటికీ దగ్గర సీటులో కూర్చోబెట్టి రైలు కదిలేటప్పుడు కన్నీటితో సాగనంపేవాడు. సంవత్సరంలో ఎన్నిసార్లు వచ్చినా ఏనాడూ మావయ్య రావడం మానేవాడు కాదు.

ఇప్పుడు మావయ్య లేడు, కానీ ప్రతిసారీ కిటికీ దగ్గర సీటు వచ్చినప్పుడల్లా నాకోసం కన్నీరు పెట్టుకునే మనిషి కోసం నా కళ్లు వెతుకుతూవుంటాయి.

*(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

**COMMENTS**